సాక్షి వికారాబాద్

శనివారం ၊ 11 ၊ నవంబర్ ၊ 2023




బరిలో నిలిచేదెవరో..?

చివరి రోజు శుక్రవారం 16మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 13న నామినేషన్లను పరిశీలించనున్నారు. 10లో▸



పోటాపోటీ ప్రచారం

మోమిన్‌పేట మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. 10లో▸



గజానికో గుంత

గజానికో గుంత ఉన్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సిక్కిం డీజీ రాకూర్ తప్ప

దౌల్తాబాద్: మండలంలోని చంద్రకల్ వద్ద ఉన్న చెక్‌పోస్టును శుక్రవారం జిల్లా పోలీస్ పరిశీలకులు, సిక్కిం రాష్ట్ర డీజీ రాకూర్ తప్ప తనిఖీ చేశారు. ఆయన అక్కడి పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం, డబ్బు రవాణా జరగకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. సీఐ రాములు, ఎస్‌ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం

కేంద్ర మంత్రి బీఎల్ వర్మ



ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ తదితరులు

చేవెళ్ల: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నింటిలోనూ పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందన్నారు. ప్రజా పాలనను గాలికొదిలేసి కుటుంబపాలన సాగించారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపిస్తే కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ సర్కార్‌తో ఎంతో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, అంసెబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరగాలి



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ శిల్పశర్మ

చేవెళ్ల: ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా జరిగేలా చూసుకోవాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్, ఐఏఎస్ శిల్పశర్మ అన్నారు. చేవెళ్లలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని నామినేషన్లు వచ్చాయి తదితర వివరాలను రిటర్నింగ్ అధికారి సాయిరాంను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆమెకు రిటర్నింగ్ అధికారి, ఎన్నికల అధికారులు స్వాగతం పలికారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని కొరడా

ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులపై కేసుల నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులపై అధికారులు కేసులు నమోదు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి 3వేల మందితో ర్యాలీకి అనుమతి తీసుకొని 20 వేలకు పైగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 5వేల మందికి అనుమతి తీసుకొని 20వేలకు పైగా జనసమీకరణ చేసినందుకు ఎన్నికల అధికారులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిపై కేసులు నమోదు చేశారు. మరోవైపు నామినేషన్ల సందర్భంగా గురువారం జరిగిన రాళ్లదాడిపై పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో కేసులు నమోదు చేసిన పోలీసులు దాడిలో పాల్గొన్న వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి శుక్రవారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 13 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీస్‌లపై దాడి చేశారని ఫిర్యాదు

ఆందోళనను అడ్డుకొని పరిస్థితిని సద్దుమణిగేలా చేయడానికి ప్రయత్నించగా పోలీసులపై దాడి చేశారని కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అభ్యర్థులు 89 | నామినేషన్లు 146

నియోజకవర్గాల వారీగా నామినేషన్ల దాఖలు

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య	నామినేషన్లు
వికారాబాద్	19	35
కొడంగల్	16	26
తాండూరు	28	37
పరిగి	26	48
మొత్తం	89	146

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- చివరి రోజు కేంద్రాల వద్ద కోలాహలం
- 13న స్క్రూటీ్నీ
- 15వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు



వికారాబాద్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి అంకం పూర్తయ్యింది. ఈ నెల 3వ తేదీ ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. జిల్లాలోని వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో 89మంది అభ్యర్థులు 146 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. 13న నామినేషన్లను పరిశీలిస్తారు. 15వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంది. అదే రోజున తుది జాబితా వెల్లడి, గుర్తుల కేటాయింపు ఉంటుంది.బీ ఫాం కేటాయించిన పార్టీలకు ఆ పార్టీ గుర్తును కేటాయించనుండగా, స్వతంత్ర అభ్యర్థులకు పలు గుర్తులను కేటాయిస్తారు. ఈ నెల 30న పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 3న కౌంటింగ్ నిర్వహించి అదేరోజు ఫలితాలు వెల్లడిస్తారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 89మంది అభ్యర్థులు, 146 సెట్ల నామినేషన్లను దాఖలు కాగా 2018 ఎన్నికల్లో 67 మంది అభ్యర్థులు, 132 సెట్ల నామినేషన్లు వేశారు.

అట్టహాసంగా..

నామినేషన్ కేంద్రాల వద్ద శుక్రవారం సందడి నెలకొంది. దరఖాస్తు చేసుకునేందుకు చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వికారాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్‌ఎస్ నుంచి డాక్టర్ మెతుకు ఆనంద్ చివరి రోజు మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. తాండూరులో కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్ వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

వికారాబాద్‌లో మెతుకు ఆనంద్(బీఆర్‌ఎస్), గడ్డం ప్రసాద్‌కుమార్(కాంగ్రెస్), పెద్దింటి నవీన్‌కుమార్(బీజేపీ), క్రాంతికుమార్(బీఎస్పీ) నామినేషన్లు దాఖలు చేశారు. తాండూరులో పైలెట్ రోహిత్‌రెడ్డి (బీఆర్‌ఎస్), బుయ్యని మనోహర్‌రెడ్డి(కాంగ్రెస్), వేమూరి శంకర్‌గౌడ్(జనసేన) నామినేషన్ వేశారు. పరిగిలో కొప్పుల మహేశ్‌రెడ్డి (బీఆర్‌ఎస్), తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి(కాంగ్రెస్), బూనేటీ మారుతికిరణ్ (బీజేపీ) నామినేషన్ దాఖలు చేశారు. కొడంగల్‌లో పట్నం నరేందర్‌రెడ్డి(బీఆర్‌ఎస్) ఎనుముల రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్), బంటు రమేశ్(బీజేపీ) నామినేషన్లు వేశారు. స్క్రూటీ్నీ, ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తరువాత ఎంత మంది అభ్యర్థులు బరిలో ఉంటారో తెలియనుంది.

నేనే లోకల్..





మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి



రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి

- తాండూరు వాసిగా కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి
- రంగారెడ్డి జిల్లా వాసిగా బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి
- నామినేషన్ల దాఖలుతో చిరునామాలు బహిర్గతం
- లోకల్.. నాన్‌లోకల్ పైనే ప్రధాన పార్టీల అభ్యర్థులు విమర్శలు
- స్థానికులనే ఆదరించాలంటున్న నేతలు

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య లోకల్.. నాన్‌లోకల్ రచ్చ పతాక స్థాయికి చేరుకుంది. తాండూరులో అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల యుద్ధం వేడి రాజేస్తోంది. నేను లోకల్ అంటే.. కాదు నేనే లోకల్ అంటూ ఎవరికి వారు స్థానికుడే ప్రచారం చేసుకుంటున్నారు. స్థానికేతరులు వద్దు.. స్థానికులే ముద్దు అంటూ ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఇదిలా ఉండగా తానూ లోకలేనంటూ కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అధికార పార్టీ నేతపై ఎదురు దాడికి దిగుతున్నారు. తాండూరులో ఇరు పార్టీ నేతల మధ్య రాజకీయ దీపావళీ పండుగకు ముందే అగ్గి పుట్టిస్తోంది. అయితే ఎన్నికల నామినేషన్లలో ఎవరి అడ్రస్ ఎక్కడ అనేది అధికారులు బహిర్గతం చేయడం గమనార్హం. ప్రచారంలో స్థానికత అంశం ప్రధాన అస్త్రంగా చేసుకొని సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యర్థి అభ్యర్థిపై విరుచుకుపడుతున్నారు. మరోవైపు తానూ లోకలేనంటూ కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై ఎదురుదాడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మనోహర్‌రెడ్డి స్థానిక అడ్రస్‌తో నామినేషన్ దాఖలు చేశారు. అయితే తానే స్థానికుడిని పదేపదే చెప్పుకున్న రోహిత్‌రెడ్డి మాత్రం నామినేషన్ పత్రాల్లో రంగారెడ్డి జిల్లా అడ్రస్ పొందుపరచడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీంతో ఎవరు లోకల్.. ఎవరు నాన్‌లోకల్ అనేది సోషల్ మీడియాలో రచ్చగా మారింది.

మణికొండ వాసిగా పైలెట్

రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అందులో స్థిర నివాసంగా రంగారెడ్డి జిల్లా మణికొండ మర్రిచెట్టు ప్రాంతంలోని లక్ష్మీనగర్ కాలనీ ప్లాట్ నంబర్ 66 పేరిట అడ్రస్ పొందుపరిచారు. దీంతో కాంగ్రెస్ నాయకులు రోహిత్‌రెడ్డే నాన్‌లోకల్ అంటూ ప్రచారం చేస్తున్నారు.

తాండూరు వాసిగా మనోహర్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి తాండూరులోని శాంతినగర్ కాలనీ వాసిగా నామినేషన్ దాఖలు చేశారు. మనోహర్‌రెడ్డి నివాసం తాండూరు పట్టణంలోని శాంతినగర్ కాలనీ, 2-2-162/ఏ తన పేరిట ఉన్న ఇంటిని నామినేషన్ పత్రాల్లో పొందుపర్చినట్లు అధికారులు ధ్రువీకరించారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రీపోలింగ్‌కు ఆస్కారం ఇవ్వొద్దు

- ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి
- పోలింగ్ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని, రీ పోలింగ్ ఎలాంటి అవకాశం ఇవ్వరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం మద్గుల్ చిటంపల్లిలోని డీపీఆర్‌సీలో ఎన్నికల సూక్ష్మ పరిశీలనకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ పోలింగ్ సజావుగా సాగడానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమన్నారు. సిబ్బంది ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా పనిచేయాలని సూచించారు. తమ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలన్నారు. మాక్ పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియపై ఎలాంటి సందేహాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలిపారు. జిల్లాకు 260 మంది సూక్ష్మ పరిశీలకులు అవసరం ఉంటుందని, అదనంగా 30మంది మైక్రో అబ్జర్వర్లను నియమించేందుకు చర్యలు చేపట్టాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబుకు సూచించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ను పరిశీలించేందుకు వ్యయ, సాధారణ, పోలీస్ పరిశీలకులు వచ్చారని తెలిపారు. డీపీఓ తరుణ్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి, మాస్టర్ ట్రైనర్లు వీరకాంతం, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

పైలెట్‌కు ఝలక్





కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్

- ఎమ్మెల్యే సొంత మండలంలో అధికార పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు
- హస్తం గూటికి బషీరాబాద్ ఎంపీపీ, జెడ్పీటీసీ
- అదే బాటలో పీఏసీఎస్ వైస్ చైర్మన్

బషీరాబాద్: అధికార బీఆర్‌ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సొంత మండలం బషీరాబాద్‌లో నేతలు ఝలక్ ఇచ్చారు. రెండు పర్యాయాలుగా ఎంపీపీగా కొనసాగుతున్న కరుణ, జెడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ తోపాటు భారీగా నాయకులు అధికార పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేశారు. శుక్రవారం తాండూరులో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకున్నారు. దీంతో పైలెట్ వర్గం ఒక్కసారిగా కంగుతింది. ఇదివరకే మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంతిబాయి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రాము నాయక్, 21 మంది సర్పంచులు, ముగ్గురు ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. ఇలా ఎమ్మెల్యే సొంత మండలంలోనే మండల ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌లోకి చేరుతుండటం అధికార పార్టీ నేతలను కలవర పెడుతోంది. వలసలు ఆపేందుకు ఎమ్మెల్యే పైలెట్ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. దీంతో బషీరాబాద్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వచ్చిందనే చెప్పవచ్చు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి వర్గంలో కొత్త జోష్ వచ్చింది.

కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

తాండూరు టౌన్/తాండూరు రూరల్: ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని, వచ్చేది మా ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తాండూరులో పలు మండలాల నాయకులు, పట్టణంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డితో కలిసి పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాండూరు ఎంపీపీ అనితాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, డైరెక్టర్లు అనంతమ్మ, నర్సింహులు, రాఘవేందర్, బిచ్చయ్య, హన్మంత్ రెడ్డి, నారాయణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. యాలాల మండలం నుంచి పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటయ్య, సీనియర్ నాయకుడు వీరయ్య కాంగ్రెస్‌లో చేరారు. తాండూరు పట్టణంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు భీంసింగ్ రాథోడ్, ప్రవీణ్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు సోఫియా, ఆఫ్షాబేగం హస్తం పార్టీలో చేరారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

'సి-విజిల్'ను సద్వినియోగం చేసుకోండి

- రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి ప్రజలు సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, భయభ్రాంతులకు గురి చేసినా, బలవంతంగా ప్రభావితం చేసినా సి-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఎలక్షన్ కమిషన్ ప్రజల చేతిలో సి-విజిల్ అనే బ్రహ్మాస్త్రం పెట్టిందని, ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న వారెవరైనా యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సమస్యను సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సి-విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ యాప్ సురక్షితమైనదని, దీనిని ఆపరేటింగ్ చేయడం సైతం చాలా సులువైందన్నారు. ఇంగ్లిష్, తెలుగులో సమస్యను పంపించవచ్చని కలెక్టర్ సూచించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ఎన్నికల ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ సహా టోల్ ఫ్రీ నంబర్ 040-23238545 ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూం 24 గంటలు పని చేస్తుంది. సిబ్బంది అందుబాటులో ఉంటారు. రిజిస్టర్ ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను రికార్డ్ చేయనున్నారు. జిల్లా ప్రజలు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల కోసం ఈ టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

30కిలోల గంజాయి పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్: గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అతని నుంచి రూ.7.50 లక్షల విలువ చేసే 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఎల్‌బీనగర్ ఎస్ఓటీ బృందం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంయుక్తంగా పెద్దఅంబర్‌పేట ఔటర్ వద్ద గురువారం రాత్రి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన వినోద్‌కిషన్ రావు భాస్కె అలియాస్ సోను వృత్తి రీత్యా లారీడ్రైవర్. గంజాయిని అక్రమంగా సరఫరా చేసి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో విశాఖపట్నం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

చిరుత కలకలం



గోధుమగూడ అటవీ ప్రాంతంలో చిరుత ఎత్తుకెళ్లిన మేక కళేబరం

- ఆనవాళ్లు గుర్తించిన అటవీ అధికారులు

అనంతగిరి: వికారాబాద్ పరిసర గ్రామాల్లో కొన్ని రోజులుగా చిరుత పులి సంచరిస్తోంది. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులు సైతం ధ్రువీకరించారు. గురువారం సాయంత్రం గోధుమగూడ గ్రామంలో మేకను లాక్కెళ్లిన చిరుత అది తిన్న ఆనవాళ్లను శుక్రవారం గ్రామస్తులు గుర్తించారు. బురంతపల్లి శివారు పొలాల్లో చిరుత పులి సంచారాన్ని గమనించి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పాద ముద్రల ఆధారంగా చిరుతేనని నిర్ధారణకు వచ్చారు. కొన్ని రోజులుగా దామగుండం అటవీ పరిసరాల్లో, గొంగుపల్లి శివారులో, అనంతగిరి అడవుల్లో, గోధుమగూడ సమీపంలో చిరుత సంచరిస్తోంది. దీంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. పొలాలు, అటవీ ప్రాంతంలో తిరిగే వారు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు.



చిరుత పాద ముద్రలు



బురాన్‌పల్లి శివారులో చిరుత కాలి ముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

క్లుప్తంగా

ప్రచార రథం అడ్డగింత

ఇద్దరిపై కేసు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్: బీఆర్‌ఎస్ కళాకారుల ప్రచార రథాన్ని అడ్డగించడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చిన్నరావిరాల గ్రామంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కళాకారుల ప్రచారరథం తిరుగుతుండగా అదే గ్రామానికి చెందిన బండారి సత్యనారాయణ, క్లోం ధర్మారెడ్డి అడ్డుకుని కళాకారులను తిట్టడటంతో పాటు బెదిరించారు. దీంతో కళాకారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు. ఇద్దరిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు.

బీజేపీకి బలమైన కేడర్

మాజీ ఎంపీ కొండా



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చిత్రంలో రత్నం

చేవెళ్ల: రాష్ట్రంలో ఎప్పుడూ హంగు పరిస్థితి రాలేదని.. ప్రజలు ఏదో ఒక పార్టీకి మెజార్టీ అందిస్తారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ అభ్యర్థి కేఎస్.రత్నం నామినేషన్ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కొండా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి గ్రామాల్లో బలమైన కేడర్ ఉందని ఈ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రాబోతుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్, చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబ పాలన సాగుతుందన్నారు. రత్నం గెలుపు ఖాయమన్నారు. రెండుసార్లు ఓటమి పాలైన రత్నం మూడోసారి తప్పకుండా గెలుస్తారన్నారు. జిల్లాలో బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్.రత్నం, నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రామ్‌దేవ్ పాల్గొన్నారు.

టీ తాగి.. రిలాక్స్ అవుతా

కేంద్ర మంత్రి వర్మ



చాయ్ తాగుతున్న కేంద్ర మంత్రి వర్మ

చేవెళ్ల: బీజేపీ అభ్యర్థి నామినేషన్ కోసం వచ్చిన కేంద్రమంత్రి బీఎల్.వర్మ ఓ సాధారణ వ్యక్తిలా చేవెళ్లలోని ఓ టీస్టాల్ వద్ద టీ తాగుతూ కనిపించారు. శుక్రవారం చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కేఎస్.రత్నం నామినేషన్ ర్యాలీ, దాఖలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నామినేషన్ కేంద్రానికి వెళ్తుండగా మార్గమధ్యలో కేఎస్.రత్నం మీడియాతో మాట్లాడుతుండగా కేంద్ర మంత్రి వర్మ మాత్రం ఒక సాధారణ వ్యక్తిలా పక్కనే ఉన్న టీస్టాల్ వద్దకు వెళ్లి టీ తాగారు. ఆయన పక్కనే ఓ గన్‌మెన్ మాత్రమే ఉన్నారు. అయితే నామినేషన్ కావటంతో ఆ రోడ్డులో పోలీసులు ఇతరులను అనుమతించలేదు. దీంతో ఆయన కాసేపు సేదతీరుతూ కనిపించారు.

34 మంది 54 సెట్ల నామినేషన్లు

మహేశ్వరం: మహేశ్వరం అసెంబ్లీ స్థానానికి శుక్రవారం 17 మంది అభ్యర్థులు 19 సెట్ల నామినేన్లు వేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్ తెలిపారు. నామినేషన్ వేసిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పట్లోళ్ల సబితా రెడ్డి, బీఎస్పీ నుంచి కొత్త మనోహర్‌రెడ్డి, భారతీయ క్రాంతి సంఘ్ పార్టీ నుంచి తుమ్మటి శ్రీరాములు యాదవ్, జన రాజ్యం పార్టీ నుంచి లక్ష్మణాచారి, యుగ తులిసి పార్టీ నుంచి గోలి సబిత, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఖలీల్ ఉజ్ జామా వివిధ పార్టీల నుంచి నామినేష్లు అందాయి. శివసేన పార్టీ అభ్యర్థి మహేష్ ఒక్కరే రెండు సెట్లను దాఖలు చేశారు. మొత్తంగా 34 మంది అభ్యర్థులు 54 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- వికారాబాద్ 19, కొడంగల్ 16
- పరిగి 26, తాండూర్ నుంచి బరిలో 28 మంది అభ్యర్థులు
- అసంతృప్త, రెబల్ నేతలను బరిలోనుంచి తప్పించే ప్రయత్నాల్లో అభ్యర్థులు
- ఉపసంహరణ వరకు బరిలో నిలిచేదెవరో?



తాండూరు టౌన్: నామినేషన్ వేస్తున్న జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి శంకర్‌గౌడ్

అనంతగిరి: వికారాబాద్ అసెంబ్లీ స్థానానికి మొత్తం 35 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటరి్నంగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. చివరిరోజు శుక్రవారం 18 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. గురువారం వరకు 17 సెట్ల నామినేషన్లు రాగా శుక్రవారం 18 సెట్ల నామినేషన్లు వచ్చాయని ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మరో రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, కాంగ్రెస్ నుంచి ప్రసాద్‌కుమార్ మరో రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి నవీన్‌కుమార్ మరొక సెట్ నామినేషన్ వేయగా, బీఎస్పీ అభ్యర్థి క్రాంతి కుమార్ మరో రెండు సెట్ల నామినేషన్లు వేశారు. గుడ్ల రుక్కయ్య బహుజన్ రిపబ్లికన్ సోషలిస్టు పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేయగా మేతరి నర్సింహులు ఇండియా ప్రజా బంధు పార్టీ నుంచి రెండు సెట్ల నామినేషన్‌లు వేయగా, గండు రవీందర్ ధర్మసమాజ్ పార్టీ నుంచి, జంగం లక్ష్మీనర్సమ్మ నవ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి, వసంత్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా, మహిపాల్ భారతీయ క్రాంతి సంఘ్ పార్టీ నుంచి, సురేష్ జనశంఖారావం పార్టీ నుంచి, దిలీప్ యుగ తులసి పార్టీ నుంచి, మహేష్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా, జి.అరుణరాణి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు.

సందడి లేని నామినేషన్లు..

కాగా ఈసారి వికారాబాద్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి సందడిలేకుండానే ముగిసింది. ఎన్నడూ లేని విధంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎలాంటి ర్యాలీలు, రోడ్ షోలు, బహిరంగ సభలు లేకుండా సాదాసీదాగా వచ్చి నామినేషన్ వేశారు. కాగా జిల్లాలోని మిగితా నియోజకవర్గాలైన తాండూర్, పరిగి, కొడంగల్‌లో నామినేషన్ ప్రక్రియల్లో భాగంగా బడా నేతలతో రోడ్‌షోలు చేసి జోష్ నింపిన విషయం తెలిసిందే.



అనంతగిరి: నామినేషన్ వేసేందుకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

కాగా నామినేషన్‌లు వేసే ముందు డాక్టర్ మెతుకు ఆనంద్, ప్రసాద్‌కుమార్ ఆలంపల్లిలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో, ఆలంపల్లి దర్గాలో, మెథడిస్టు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బుజ్జగింపుల పర్వం షురూ..

నామినేషన్ల పర్వం ముగియడంతో ఇప్పడు ప్రధాన పార్టీల నేతలంటూ రెబల్, అసంతృప్త అభ్యర్థుల నామినేషన్లను వెనక్కి తీసుకునేలా వారిని బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. తమకు అధిష్ఠానం టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర, ఇతర పార్టీల నుంచి అభ్యర్థులుగా నిలిచిన ద్వితీయ శ్రేణి నేతలను పోటీలోనుంచి తప్పిస్తే తమ ఓట్లకు గండి పడదనే ఆలోచనలో నేతలు ఉన్నారు. ఉపసంహరణ గడువు లోపు అభ్యర్థులతో మాట్లాడి వారితో నామినేషన్ విత్‌డ్రా చేయించేందుకు ప్రయత్నాలు చేయనున్నారు.

కొడంగల్ నుంచి 16..



నామినేషన్ వేస్తున్న బీఎస్పీ అభ్యర్థి నర్మద

కొడంగల్: కొడంగల్ అసెంబ్లీ స్థానానికి శుక్రవారం వరకు మొత్తం 16 నామినేషన్లు దాఖలైనట్లు రిటరి్నంగ్ అధికారి లింగ్యా నాయక్ తెలిపారు. ప్రధాన పార్టీల నుంచి ఎనుముల రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్), పట్నం నరేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్), బంటు రమేష్ (బీజేపీ), కుర్వ నర్మదా కిష్టప్ప (బీఎస్పీ) నామినేషన్లు దాఖలు చేశారు.

పరిగిలో 26 మంది..

పరిగి: నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి పరిగి అసెంబ్లీ స్థానానికి మొత్తం 26 మంది అభ్యర్థులు 48 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌ఓ విజయకుమారి తెలిపారు. ప్రాధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు డబుల్ సెట్లు, ట్రిబుల్ సెట్ల నామినేషన్లు వేశారు.

తాండూర్‌లో 28 మంది..

తాండూర్ టౌన్: నామినేషన్లకు చివరి రోజు శుక్రవారం తాండూరు స్థానానికి 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం మీద 28 మంది అభ్యర్థులు 37 సెట్ల నామినేషన్లు వేశారు.

చేతులెత్తండి నుంచి ఈవీఎం





- ఓటుహక్కు వినియోగంలో సమూల మార్పులు
- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ఎన్నికల కమిషన్

షాద్‌నగర్: ఒకప్పుడు చేతులెత్తి అభ్యర్థిని ఎన్నుకునే స్థాయి నుంచి నేడు ఈవీఎంల సహాయంతో ఓటుహక్కును వినియోగించుకునే స్థాయికి మనదేశం ఎదిగింది. మన దేశాన్ని పాలించిన ఆంగ్లేయుల కాలం నుంచి పౌరులు ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత మొదటిసారి 1952లో సాధారణ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో దేశంలోని పౌరులందరికీ ఓటుహక్కు ఉండేది కాదు. ఉద్యోగులు, అక్షరాస్యులతో పాటు భూస్వాములకు మాత్రమే ఓటుహక్కు కల్పించారు. నాడు మండలాలను ఫిర్కాలుగా పిలిచేవారు. గ్రామ స్థాయిలో విలేజ్ మేజిస్ట్రేట్(వీఎం)లు ఉండేవారు. వీరి వద్దనే ఓటర్లుగా నమోదు చేసుకొని ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకునే వారు. ఓటు వేసే విధానంలో కూడా తేడా ఉండేది.ప్రత్యక్ష పద్ధతిలో బహిరంగ సభను నిర్వహించి మెజార్టీకోసంచేతులెత్తి ఓటును వినియోగించుకునేవిధానం అమల్లోఉండేది.

ఒక్కో అభ్యర్థికి ఒక్కో బాక్స్..

1952, 1957లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థికి ఒక బాక్స్‌ను ఏర్పాటు చేసేవారు. ఓటర్లు వారికి నచ్చిన వ్యక్తికి సంబంధించిన బాక్స్‌లో ఓటు వేసేవారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల నుంచి పోటీలో ఎంతమంది అభ్యర్థులు ఉన్నా ఒకే బాక్స్‌ను కేటాయించి అందులోనే ఓటు వేసే విధానాన్ని తీసుకొచ్చారు. 1962 నుంచి ప్రతీ పోలింగ్ కేంద్రంలో అభ్యర్థులందరికీ ఒకే బాక్స్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో 70 శాతానికి మించి పోలింగ్ నమోదైతే రిగ్గింగ్ జరిగిందని అధికారులు నిర్ధారణకు వచ్చేవారు. తర్వాత క్రమంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. రహస్య పోలింగ్ విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. బ్యాలెట్ పత్రాలతో ఓటువేసే విధానం నుంచి ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలను ఉపయోగించే స్థాయికి సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది.

ప్రచార రథం అడ్డగింత

అబ్దుల్లాపూర్‌మెట్: బీఆర్‌ఎస్ కళాకారుల ప్రచార రథాన్ని అడ్డగించడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలోచోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చిన్నరావిరాల గ్రామంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కళాకారుల ప్రచారరథం తిరుగుతుండగా అదే గ్రామానికి చెందిన బండారి సత్యనారాయణ, క్లోం ధర్మారెడ్డి అడ్డుకుని కళాకారులను తిట్టడటంతో పాటు బెదిరించారు. దీంతో కళాకారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు. ఇద్దరిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

ఆమనగల్లు: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లులో శుక్రవారం ఆయన నామినేషన్ దాఖలు చేయడానికి ముందు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అవినీతి పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ర్యాలీలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ అనిత, శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, జంగయ్య, జగన్, మానయ్య, రాములు, శ్రీను, మల్లయ్య, బాబా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న కసిరెడ్డి, నాయకులు

బాలాజీ.. కరుణించు



చిలుకూరు ఆలయ సిబ్బందితో మంత్రి సబితారెడ్డి

మొయినాబాద్: మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఎన్నికల నామినేషన్ సందర్భంగా శుక్రవారం ఉదయం ఆమె తన కుమారుడు కౌశిక్‌రెడ్డితో కలిసి దేవాలయానికి వచ్చారు. నామినేషన్ పత్రాలు స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రంగరాజన్ మంత్రి సబితారెడ్డిని ఆశీర్వదించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఆంద్రూ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ పలకరింపులు కుశల ప్రశ్నలు

- ఓటర్లకు నేతల సకల మర్యాదలు
- నన్ను మర్చిపోకు అన్నా అంటూ దండాలు



దౌల్తాబాద్: అధికారంలో ఉన్నప్పుడు, సామాన్యుడికి ఏదైనా సమస్య వచ్చి, అయ్యా ఆదుకోండని దగ్గరికి వెళితే నేడు, రేపు అంటూ ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేయించుకునే నాయకులు ఎన్నికల వేళ.. ఓటరు దేవుడి దర్శనం కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. అయ్యా, అవ్వా, అక్కా, చెల్లీ, అన్నా, తమ్ముడూ అంటూ సామాన్యుడి చుట్టూ తిరుగుతున్నారు. మళ్లీమళ్లీ తారసపడుతున్నారు. కుశల ప్రశ్నలు వేస్తూ నన్ను మర్చిపోకండి అంటూ రెండు చేతులు ఎత్తి దణ్ణం పెడ్తుతున్నారు.

పదవి మీద ఉన్న ప్రేమ..

మామూలు సమయంలో ఎవరూ వచ్చినా, ఏమి అడిగినా స్పందించని నేతలు.. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా చనిపోయారని తెలిస్తే చాలు వీలైనంత తొందరగా అక్కడ వాలిపోతున్నారు. బాధితులను పరామర్శించి, తోచినంత ఆర్థిక సహాయం చేస్తూ.. మా పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇవ్వటం గమనార్హం. ఇలా ఎప్పటికప్పుడు నియోజకవర్గాన్ని చుట్టుముడుతూ ప్రజలను ఆకట్టుకునే యత్నం చేయడంతో సామాన్యులు ఆశ్చర్య పోతున్నారు. ఎన్నికలు అనగానే రాజకీయ నాయకులు అందరూ ఇలా పల్లెలో వాలిపోతున్నారని, మిగతా సమయంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా రాని వారు.. ఓటు కోసం ఇలా తిరగడం ఎంత స్వార్థం అని వాపోతున్నారు. పదవి మీద ఉన్న ప్రేమ.. సగటు జీవిపై చూపిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

బరిలో నిలిచేదెవరో..?



నామినేషన్ వేసేందుకు స్కూటీపై వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్ రెడ్డి



నామినేషన్ వేస్తున్న ఛాయ్‌వాలా అవుటి శ్రీశైలం (స్వతంత్ర)

- తాండూరులో మొత్తం 28 నామినేషన్లు దాఖలు
- చివరిరోజు నామినేషన్ వేసిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు

తాండూరు టౌన్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం మీద తాండూరు అసెంబ్లీ స్థానానికి 28 మంది నామినేషన్లు వేశారు. ఇప్పటివరకు వీరంతా కలిసి మొత్తం 37 సెట్ల నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్ రెడ్డి చివరిరోజు మరో నామినేషన్ సెట్ వేసేందుకు వెళ్తుండగా కౌన్సిలర్ నీరజగుమ్మడికాయతో దిష్టి తీసి పంపారు. అయితే ఆయన భారీ ర్యాలీగా రావడంతో ఆలస్యమైంది. దీంతో చివరి నిమిషంలో ఆయన నామినేషన్ సెట్ సమర్పించేందుకు స్కూటీపై హడావిడిగా వెళ్లారు.

గాజు గ్లాసు గుర్తు కేటాయింపు...

తాండూరు జనసేన అభ్యర్థి నేమూరి శేఖర్ గౌడ్‌కు గాజుగ్లాసు గుర్తు కేటాయించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేసినపుడు జనసేన పార్టీ కేవలం 32 నియోజకవర్గాల్లో మాత్రమే (తాండూరు కాకుండా) పోటీ చేయనున్నట్లు ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే తాజాగా శుక్రవారం మరో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థి బి-ఫామ్‌తో పాటు ఏ-ఫామ్‌ను కూడా సమర్పించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేయవచ్చని ఎన్నికల కమిషన్ ఏ-ఫామ్ ఇవ్వడంతో జనసేన అభ్యర్థి నేమూరి శంకర్‌గౌడ్‌కు గాజు గ్లాసు గుర్తు కేటాయించనున్నట్లు ఆర్‌ఓ తెలిపారు.

నామినేషన్ వేసిన ఛాయ్‌వాలా ...

తెలంగాణ ఉద్యమకారుడు, తాండూరు పట్టణానికి చెందిన అవుటి శ్రీశైలం అనే చాయ్‌వాలా శుక్రవారం తాండూరు అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేశారు. గతంలో ఈయన 2014, 2018లో ఎమ్మెల్యే, 2019లో ఎంపీ స్థానానికి కూడా నామినేషన్ వేశారు. అయితే అప్పట్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఆయన ఈసారి మాత్రం నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరుపున నామినేషన్ దాఖలు చేశారు. ఉద్యమకారులకు సముచిత స్థానం దక్కలేదని, వారికి ప్రాధాన్యత కల్పించాలనే డిమాండ్‌తోనే ఎమ్మెల్యేగా నామినేషన్ వేసినట్లు శ్రీశైలం చెప్పారు. అయితే గత మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కుటుంబం మొత్తం కౌన్సిలర్ స్థానాలకు కూడా నామినేషన్ వేయడం విశేషం.

పోటాపోటీ ప్రచారం



కేసారంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఇప్పటికే గ్రామాలను చుట్టేసిన బీఆర్‌ఎస్
- వేగం పెంచిన కాంగ్రెస్
- ప్రచారమే ప్రారంభించని బీజేపీ, బీఎస్పీ

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. బీజేపీ, బీఎస్పీ పార్టీల ప్రచారం ఇంకా ప్రారంభమే కాలేదు. వారం రోజుల వరకు కేవలం బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే ప్రచారం జోరుగా సాగింది. మండల నాయకులతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు అనంద్ మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో ఇప్పటికే ప్రచారం ముగించారు. ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రస్తుతం ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. కాగా ఇటీవలే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి సోమవారం నుంచి ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ఆయన ముమ్మర ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేకతను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ఈనెల 16వ తేదీ నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిసింది. బీజేపీ అభ్యర్థికి ఇటీవలే టికెట్ ఇవ్వడంతో నామినేషన్ల పర్వం ముగిసిన తర్వాత ప్రచారం చేయనున్నట్లు తెలిసింది. బీఎస్పీ అభ్యర్థి క్రాంతి కుమార్ మండల పరిధిలోని చీమల్‌దరి గ్రామానికి చెందిన వ్యక్తి. అతను కూడా ఇప్పటివరకు ప్రచారం ప్రారంభించలేదు. ముఖ్యంగా మండలంలో రెండు పార్టీ(బీఆర్‌ఎస్, కాంగ్రెస్)ల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీఎస్పీ, బీజేపీలకు తగినంత కేడర్ లేకపోవడంతో పోటీ ఆ రెండు పార్టీల మధ్యే ఉంటుందని స్థానికంగా టాక్.

ఓటేరా.. అభివృద్ధికి బాట



రాష్ట్రమంతటా ఎటుచూసినా ఎన్నికల హడావుడి. ఊరు, వాడ ఎటుచూసినా ఎన్నికల ధూంధాం, ప్రచార రథాలు, ర్యాలీలతో మార్మోగుతోంది. ఇవన్నీ ఓటర్‌ను ఆకర్షించేందుకు. అలాంటి అమూల్యమైన ఓటుపై మన బొంరాస్‌పేట మండలానికి చెందిన ఓ కవి అందించిన పాట.. మీకోసం..

పల్లవి: ఓటేరా మనదేశపు రక్షణ కోట
ఓటేరా అభివృద్ధికి చక్కనిబాట
చరణం1: రాజ్యాంగం నీకిచ్చిన రామబాణమే ఓటు
➡ ధర్మాన్ని నడిపించెడి ధర్మచక్రమే ఓటు
➡ ప్రజాస్వామ్య సౌధానికి పునాదిరాయి ఓటు
➡ స్వార్థనాయకులకు వేసి తెచ్చుకోకురా చేటు
చరణం2: ఓటే బలమైన శక్తి,
➡ ఓటే ఘనమైన భక్తి
➡ మంచివారినెన్నుకొనగ చూపుము నీధీయుక్తి
➡ ప్రజలందరి కాంక్షలను ఇచ్చిన వాగ్దానాలను
➡ నెరవేర్చిన నేతలకు వేయాలిక నీఓటు

– రచన: వడిచర్ల సత్యం, కవి, బొంరాస్‌పేట

ఓటు.. కారాదు వృథా



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని కమ్మగూడలో 243, 244, 245, 246 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమన్నారు. ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



పతి కోసం.. సతి ప్రచారం

దోమ: అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి మహేశ్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదిస్తే ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన సతీమణి ప్రతిమారెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓ హోటల్‌లో టీ తాగి... అక్కడి సిబ్బందిని ఓటు అభ్యర్థించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, కోఆప్షన్ సభ్యుడు ఖజా పాషా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.